క్లుప్తంగా

కొవ్వూరు నియోజకవర్గానికి రూ.15 కోట్ల ఉపాధి నిధులు

హోం మంత్రి తానేటి వనిత వెల్లడి



కొవ్వూరు: ఉపాధి హామీ పథకం కింద ఒక్కో మండలానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు విడుదలైనట్లు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రకటించారు. కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి మంత్రి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి కొవ్వూరు నియోజకవర్గానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి ప్రకటించారు. ఆయా గ్రామాల నుంచి ప్రతిపాదనలు తీసుకున్న తర్వాత ఈ నిధులతో పనులు చేపడతామన్నారు. కావున గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు సమన్వయ పరుచుకుని గ్రామాభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు మంత్రి సూచించారు.

వేంకటేశ్వరస్వామికి పవిత్రోత్సవాలు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను రెండో రోజైన మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, అగ్ని మథనం వంటి క్రతువులు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం అగ్ని ధ్యానం, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్ర పుష్పాల సమర్పణ జరిగాయి. యర్రంశెట్టి బ్రహ్మాజీరావు కుటుంబ సభ్యులు ఈ పూజాదికాలు నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వరరావు, వర ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ, యాగాగ్ని కార్యక్రమాలు జరిగాయి. పవిత్రోత్సవాలను అన్నవరప్పాడు వాసులే గాకుండా పరిసర కడింపాడు, పిట్టల వేమవరం, దొంగరావిపాలెం గ్రామాల ప్రజలు కూడా తిలకించారు.

‘ఆడుదాం ఆంధ్రా’ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

నిడదవోలు రూరల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణకు చర్యలు తీసుకుందని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రిని ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులకు ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శామ్యూల్, ఎంఈఓ పి.గురుమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావం పెద్దగా లేదు

ఉండ్రాజవరం: తుపాను ప్రభావం మండలంలోని రైతులపై పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని మండల ప్రత్యేకాధికారి ఎం.సందీప్ అన్నారు. మండలంలోని పలు తుపాను ప్రభావిత ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణం రకం పండించిన రైతులు ముందుగానే కోతలు పూర్తవడంతో వారిపై తుపాను ప్రభావం లేదన్నారు. 1318, పీఎల్ రకాలు పండించిన రైతులపై మాత్రం స్వల్పంగా తుపాను ప్రభావం ఉందన్నారు. బుధవారంతో వర్షం ఆగిపోతే రైతులు గట్టెక్కినట్టేనన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు, ఉండ్రాజవరం వీఆర్వో వెలిచేటి పాపారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది నాగమణి, రైతులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వృద్ధురాలు



ప్రక్కిలంక నుంచి వృద్ధురాలిని అనాథాశ్రమానికి తరలిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: ఆమె పేరు నల్లజర్ల రాఘవమ్మ. వయసు 70 ఏళ్ల పైమాటే. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. కొద్ది రోజులుగా మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో ఆ పంచన, ఈ పంచన తలదాచుకుంటోంది. ఎవరైనా ఏదైనా పెడితో తింటోంది. మీది ఏ ఊరు.. ఎక్కడి నుంచి వచ్చావు? అని ఎవరైనా అడిగినా ఆమె తన వివరాలు చెప్పలేకపోతోంది. వృద్ధురాలైన ఈ అనాథను ప్రక్కిలంక గ్రామస్తులు తాళ్లపూడికి చెందిన కొందరి సహాయంతో మంగళవారం దేవరపల్లి గ్రామంలోని జై కిసాన్ అనాథాశ్రమంలో చేర్పించారు. సిరి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ భాను, ఆదరణ సేవా సంస్థ సురేష్, ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు, దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు తొర్లపాటి రాజీవ్, ప్రత్తిపాటి అబెద్నగో, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీడని వర్షం.. తోడైన ఈదురు గాలులు

- తుపాను ప్రభావంతో నేలనంటిన వరి
- దెబ్బతిన్న ఆహార, ఉద్యాన పంటలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- రోడ్లపై కూలిన చెట్లు, విద్యుత్తు స్తంభాలు
- పెరవలి మండలంలో 150 ఎకరాల్లో వరికి నష్టం



దూబచర్లలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న తహసీల్దారు కిశోర్‌కుమార్



అన్నదేవరపేటలో ధాన్యం తడిసిపోకుండా బరకాలు కప్పిన రైతులు

పెరవలి: ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలోని వరి చేలు, ఉద్యాన , కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరవలి మండలంలో 150 ఎకరాల్లోని వరి చేలు నీట మునిగాయని డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ తెలిపారు. అలాగే 10 హెక్టార్ల విస్తీర్ణంలోని ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు చెప్పారు. పంట నష్టాల అంచనాలపై ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చామని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

ఈదురు గాలులకు నేలమట్టం

తుపాను ప్రభావంతో మండలంలో బలంగా ఈదురు గాలులు వీస్తున్నాయి. ఫలితంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేలనంటింది. అరటి తోటలు నిలువునా విరిగిపోతున్నాయి. అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు రోడ్ల పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలపై పడడంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గాలుల ప్రభావంతో కానూరు గ్రామంలో చేపల చెర్వు వద్ద ట్రాన్స్‌ఫారంతో సహా విద్యుత్ స్తంభాలు చెర్వులో పడిపోయాయి. నల్లాకులవారిపాలెం వద్ద 11 కేవీ విద్యుత్తు లైన్‌పై కొబ్బరి చెట్టు పడిపోయింది.

శెట్టిపేటలో కూలిన విద్యుత్తు స్తంభాలు

నిడదవోలు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నిడదవోలు ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. లోతట్టు ప్రాంతాలు నీటితో మునిగాయి. రాకపోకలకు ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. మూడు రోజులుగా ముసురు పట్టడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రోజువారీ వ్యాపారం చేసుకునే వారికి ఉపాధి కరవైంది. వారందరూ ఇళ్లకే పరిమితం అయ్యారు. పట్టణంలో తీరుగూడెం వద్ద చెట్టు కూలి రోడ్డుపై పడింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని శెట్టిపేట గ్రామంలో ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి వెంబడి ఐదు విద్యుత్ స్తంభాలు కుప్పకూలిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు శాఖ అధికారులు



శెట్టిపేటలో రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం

సిబ్బంది సాయంతో వాటిని పునరుద్ధరిస్తున్నారు. పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వేరుశనగ, మినుము పంటలకు నష్టం

నల్లజర్ల: తుపాను ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రానికి 111మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. వేరుశనగ, మొక్కజొన్న, వరి, మినుము పంటలు అక్కడక్కడా దెబ్బతిన్నాయి. వ్యవసాయ సహాయకులు దెబ్బతిన్న ప్రాంతాలకు వెళ్లి నష్టం అంచనాలు వేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కమల్ రాజ్ మంగళవారం తెలిపారు. దూబచర్ల శివారు గాంధీ కాలనీ వద్ద చెరువు గట్టు తెగి సమీపంలోని వరి పంటను వరద నీరు ముంచెత్తింది. బుధవారం నాటికి వరద నీరు తగ్గుముఖం పడితే పంటకు నష్టం ఉండదన్నారు. వరి పంటను కోసినట్టయితే తేమ శాతంతో పని లేకుండా ఏమిల్లుకైనా రైతులు తరలించుకోవచ్చని ఏవో చెప్పారు.

తాళ్లపూడి: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సాధారణ పౌర జీవనానికి అంతరాయం కలిగింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోకుండా రైతులు బరకాలు కప్పి ఉంచారు. ధాన్యం రాశుల్లోకి నీరు చేరకుండా రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలంలో 94 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఏఎస్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు.



ముక్కామలలో నేలనంటిని వరి పైరును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



నల్లాకులవారిపాలెం వద్ద విద్యుత్తు లైన్‌పై పడిన కొబ్బరి చెట్టు

విస్తారంగా వర్షాలు

చాగల్లు: మంగళవారం ఉదయం వరకూ మండలంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జన జీవనం స్తంభించింది. రోడ్లు డ్రెయిన్‌లపై వర్షపు నీరు నిలిచిపోయింది. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

వర్షాలు తగ్గే వరకూ వరి కోతలు ఆపండి

- రైతులకు కలెక్టర్ మాధవీలత సూచన
- అధికారులతో కలసి కాపవరంలో వరి పంట పరిశీలన

కొవ్వూరు: తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున, అవి తగ్గేంత వరకూ వరి కోతలు కోయవద్దని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత రైతులకు సూచించారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. కలెక్టర్ మంగళవారం కొవ్వూరు మండలం, కాపవరం గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన పంటలను పరిశీలించారు. ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యాన్ని మిల్లలకు తరలించామన్నారు.రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు పంట పొలాల్లోని నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎప్పకప్పుడు అందుబాటులో ఉండాలని అధికారులను ఆమె ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలను రైతులు పాటించాలన్నారు. కొవ్వూరు మండలంలో 10,200 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటికే పది వేల ఎకరాల్లో కోతలు పూర్తయినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలతకు వివరించారు. సుమారు 200 ఎకరాల్లోని వరి పంటను మాత్రమే కోయాల్సి ఉందని తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి అరుణకుమారి, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఉద్యానశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు .. ప్రభుత్వం అండగా ఉంది

- రైతులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి భరోసా
- కలవచర్లలో నేలవాలిన పంటల పరిశీలన

నిడదవోలు రూరల్: రైతులు అధైర్య పడవద్దని, తుపాను వల్ల పంట దెబ్బతిన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు హామీ ఇచ్చారు. తుపాను ప్రభావంతో మండలంలోని కలవచర్లలో నేలవాలిన వరి పొలాలను ఆయన మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని



కలవచర్లలో పంట దెబ్బతిన్న రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

మిల్లుల వద్ద త్వరితగతిన అన్ లోడింగ్ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యం సేకరణ జరుగుతోందన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందన్నారు. ఆర్‌బీకేల వద్ద గోనె సంచులను సిద్ధంగా ఉంచాలని అధికారులక ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూర్యనారాయణ, తహసీల్దార్ ఎం.గంగరాజు, ఏవో జి.సత్యనారాయణ, స్థానిక రైతులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యంపై ఎంఈఓ ఫిర్యాదు

నల్లజర్ల: ఓ టీచర్ సర్వీసు రిజిస్టరు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న పోతవరంలోని వివేకానంద ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యంపై ఎంఈఓ వై.సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత 11 నెలలుగా తనకు సర్వీసు రిజిస్టరు ఇవ్వకుండా, జీతం రాకుండా ఇబ్బంది పెడుతున్న ఆ ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యంపై టీచర్ కె.సుగుణకుమారి స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సుగుణకుమారికి 60 ఏళ్లు నిండడంతో గతేడాది జూన్ 31న రిటైరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజులకే ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచడంతో ఆమె ఈఏడాది జనవరి 2 నుంచి మళ్లీ విధులకు హాజరవుతున్నారు. అయితే వివేకానంద ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యం ఆమెను జాయిన్ చేసుకోలేదు. డీఈఓ ఉత్తర్వుల మేరకు ఫేషియల్ యాప్ వేస్తూ విధులు నిర్వర్తించేవారు. కాగా 2023 జూన్‌లో వివేకానంద ఎయిడెడ్ స్కూల్‌ను విద్యాశాఖలో విలీనం చేశారు. ఆ ఎయిడెడ్ స్కూల్లోని ముగ్గురు టీచర్లను ప్రభుత్వ పాఠశాలలకు బదలాయించారు. అందులో ఇద్దరి ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లను ఎంఈఓకు యాజమాన్యం అందించింది. ఒక్క సుగుణకుమారి సర్వీసు రిజిస్టరు మాత్రం ఇవ్వడం లేదు. దీనిపై సుగుణకుమారి స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆ స్కూల్ యాజమాన్యంపై మండిపడ్డారు. ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యంపై పోలీసు కేసు నమోదు చేయాలని ఎస్పీని కలెక్టరు ఆదేశించారు. ఈ క్రమంలో నల్లజర్ల ఎంఈఓ వై.సత్యనారాయణ సోమవారం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో ఈవిషయమై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

వసతి గృహంలోని వరద నీరు

సురక్షిత ప్రాంతానికి 44 మంది విద్యార్థుల తరలింపు

నల్లజర్ల: స్థానిక ఆనాథ పిల్లల ఆనంద నిలయం (వసతి గృహం)లోకి వరద నీరు ప్రవేశించింది. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వరద నీరు వచ్చి చేరింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పల్లి జ్యోతి, విద్యాకమిటీ చైర్మన్ కూరపాటి నాగరాజు, వార్డెన్ ధర్మయ్య వసతి గృహానికి వెళ్లి అక్కడున్న 44 మంది విద్యార్థులను సమీపంలోని నంబర్-1 పాఠశాల వద్దకు తీసుకువెళ్లి వసతి ఏర్పాట్లు చేశారు. వీరందరూ 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్నారు. కాగా వసతి గృహంలోని సామగ్రి అంతా గదిలోని ఎత్తైన ప్రదేశంలో భద్రపరిచారు.ఈ రాత్రికి పాఠశాలలో ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్టు విద్యా కమిటీ



ఆనంద నిలయం వసతి గృహంలోకి ప్రవేశించిన వరద నీరు

చైర్మన్ నాగరాజు తెలిపారు. నల్లజర్ల ఎగువ ప్రాంతంలో ఉన్న రిజర్వు ఫారెస్ట్ నుంచి వచ్చే వాగు నీరు ఈ వసతి గృహాన్ని ముంచెత్తింది.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు: గోదావరి నదిలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకుని వచ్చింది. పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టడానికి కూడా వీల్లేనంతగా ఆ శవం ఉంది. మృతుడి వయసు సుమారు నలభై ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నామని కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడు సుమారు ఐదడుగుల రెండంగుళాల ఎత్తు ఉంటాడన్నారు. అతని ఎడమ చాతీపై లక్ష్మి అని, ఎడమ చేతిపై సంధ్య అని పచ్చబొట్లు ఉన్నట్టు సీఐ తెలిపారు. బ్లూ కలర్ జీన్ ప్యాంటు, బిస్కట్ కలర్ పొడవు చేతుల చొక్కా ధరించి ఉన్నట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతుడి వివరాల కోసం కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో గాని, 94407 96622 అనే ఫోన్ నంబర్‌కి కాల్ చేసి గాని తెలుసుకోవాలన్నారు.

ఘంటావారిగూడెం ఎస్సీ కాలనీలో వరద నీరు



ఘంటావారిగూడెంలో గృహాల్లోని చేరిన నీరు

నల్లజర్ల: గన్నేరుగుంట వాగు వరద ఉధృతికి మండలంలోని ఘంటావారిగూడెం ఎస్సీ కాలనీ నీట మునిగింది. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి అంతంత మాత్రంగా ఉన్న వరద నీరు సాయంత్రం అయ్యేసరికి ఇళ్లలోకి వచ్చి చేరింది. దాంతో 10 కుటుంబాల వారు ఇళ్లు ఖాళీ చేసి సమీపంలోని కమ్యూనిటీ హాల్లో తలదాచుకున్నారు. వారందరికీ ఎంపీటీసీ సభ్యురాలు యలమర్తి సూర్యకుమారి కుమారుడు వాసు సహాయక చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కిశోర్‌కుమార్ ఇక్కడకు వచ్చి పరిశీలించారు. ఈ కాలనీని ముంచెత్తిన వరద నీరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద రహదారిపై నుంచి గ్రామంలో ప్రధాన వీధుల్లోని ప్రవేశించి రాకపోకలకు అంతరాయం కలిగించింది. కాగా ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఘంటావారిగూడెంలోని ఊర చెరువు పూర్తిగా నీటితో నిండిపోవడమే గాకుండా గట్లు తెగే స్థాయికి చేరుకుంది.

కులగణనపై అవగాహన

చాగల్లు: కుల గణనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళఆరం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మట్టా వీరాస్వామి మాట్లాడుతూ పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది కులగణపై అవగాహన పెంచుకుని సర్వేను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుడిగాలి బీభత్సం

- దుద్దుకూరు గ్రామంలో, పెరవలి మండలంలో తీవ్ర నష్టం
- విరిగిపడిన విద్యుత్తు స్తంభాలు
- నేలకూలిన చెట్లు, తోటలు



దుద్దుకూరులో రోడ్డుపై కూలిన చెట్టు, స్తంభం



ముక్కామలలో కూలిన పెంకుటిల్లు

దేవరపల్లి: తుపాను ప్రభావంతో బలమైన సుడిగాలులు వీచాయి . మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి భారీ వర్షంతో పాటు గాలుల తీవ్రత ఎక్కువ కాడడంతో గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దుద్దుకూరులో రాత్రి 7 గంటలకు సుడి గాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామ పంచాయతీ సమీపంలో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగి ప్రధాన రహదారిపై పడ్డాయి. రోడ్డు పక్కనే గల వృక్షం కూలి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏలూరు-గుండుగొలను- కొవ్వూరు (ఈజీకే) ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్తు స్తంభాలు విరిగి పడడంతో గ్రామంలో సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు విరగడంతో పాటు తీగలు తెగిపడినట్టు దుద్దుకూరు గ్రామస్తులు తెలిపారు. భారీ వర్షానికి పలు గ్రామాల్లో డ్రైన్లు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లు జలమయం అయ్యాయి. దేవరపల్లిలోని థియేటర్ రోడ్డు జలమయమైయింది.

రోడ్లపై బరకాల మాటున ధాన్యం రాశులు

ధాన్యాన్ని రోడ్లపై రాశులుగా పోసిన రైతులు, వాటిపై బరకాలు కప్పి ఉంచారు. గుండుగొలను-కొవ్వూరు హైవేలో సర్వీస్ రోడ్లపై నల్లజర్ల మండలం నల్లజర్ల, అనంతపల్లి, దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం, యర్నగూడెం, కృష్ణంపాలెం, దుద్దుకూరు, గౌరీపట్నం, కొవ్వూరు మండలం కాపవరం, పంగిడి గ్రామాల్లో రైతులు ధాన్యం రాసులు ఉన్నాయి. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల మండల కమిటీ సభ్యులు ధాన్యం రాసులను పరిశీలించి తడిసిన ధాన్యాన్ని కొరుగోలు చేసి హోరు వర్షంలోను బస్తాల్లో పట్టి మిల్లులకు తరలిస్తున్నారు.

పెరవలి మండలంలో

పెరవలి: మండలంలో మంగళవారం సుడిగాలి బీభత్సం సృష్టించింది. దాంతో లంకమాలపల్లి, ముత్యాలవారిపాలెం, ఓదూరివారిపాలెం, ముక్కామల గ్రామాలకు అపార నష్టం వాటిల్లింది. లంకమాలపల్లిలో ప్రారంభమైన సుడిగాలి మిగిలిన గ్రామాల మీదుగా ప్రయాణించి గోదావరి లంకల్లోకి వెళ్లింది. భయంకరమైన గాలులకు అరటి, కొబ్బరి, తాడి చెట్లు, పశువుల పాకలు, పెంకుటిళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నిలువునా కూలిపోయాయి. సుడిగాలి వల్ల ప్రాణనష్టం లేకపోయినా భారీగా ఆస్తినష్టం జరిగింది. ఈ నాలుగు గ్రామాల పరిధిలో సుమారు 30 విద్యుత్తు స్తంభాలు, 50 కొబ్బరి చెట్లు, అరటి తోటలు నేలకొరిగాయని ముక్కామల సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, లంకమాలపల్లి ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు తెలిపారు.



దుద్దుకూరులో మెయిన్ రోడ్డుపై విరిగి పడిన విద్యుత్తు స్తంభాలు



ముత్యాలవారిపాలెంలో రోడ్డుపై విరిగి పడిన చెట్లు



ముక్కామలలో పశువుల పాకపై కూలిన విద్యుత్తు స్తంభాలు



ఓదూరివారిపాలెం రోడ్డుపైకి ఎగిరి వచ్చి పడిన రేకులు, పడిన విద్యుత్తు స్తంభాలు

నల్లజర్లలో 116.6 మిల్లీ మీటర్ల వర్షపాతం

కొవ్వూరు: తుపాను ప్రభావంతో మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 36.4 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. నల్లజర్లలో రికార్డు స్థాయిలో 111.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు తెలిపారు. భారీ వర్షాలకు కొవ్వూరు డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో జలమయంగా మారాయి. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం, తాళ్లపూడి మండలం పెద్దేవం, కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామాల్లో నాలుగు విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి.బ్రాహ్మణగూడెంలో తాటిచెట్టు విద్యుత్ లైన్‌పై పడడంతో స్తంభం విరిగిపో యింది.పెద్దేవం, ఐ.పంగిడి గ్రామాల్లో చెట్లు విరిగి మీద పడడంతో విద్యుత్తు తీగలు తెగిపోయాయి. ఫలితంగా సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఐ.పంగిడిలో సరఫరా పునరుద్ధరణకు అధికారులు అదనంగా మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం గా కొనసాగుతున్నాయి.ఈ తరుణంలో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.కొవ్వూరు పట్టణ శివార్లలో మంగళవారం రాత్రి చెట్టు కొమ్మ విరిగిపడడంతో సుమారు గంటన్నర పాటు పట్టణం అంతా సరఫరా నిలిపి వేశారు.



భారీ వర్షానికి కొవ్వూరులో రోడ్డుపై నిలిచిపోయిన నీరు